క్లుప్తంగా

జేఈఈలో సత్తా చాటిన విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అగనంపూడి: జేఈఈ మెయిన్స్ క్వాలిఫై అయిన అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సుందరపు శశాంక్, ఇందల తేజ్ మైఖేల్‌ను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అభినందించారు. ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన వారిని ఆయన సత్కరించారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లోనూ మంచి ర్యాంక్ సాధించి, ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి జగన్ పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం లక్షల కోట్లు వ్యయం చేస్తున్నారని, దాని ఫలితం కనపడుతుండడం సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వి.సుశీల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సత్కారం

కూర్మన్నపాలెం: జేఈఈ మెయిన్స్‌లో మంచి పర్సంటైల్ సాధించిన కూర్మన్నపాలెం సుదీక్ష జూనియర్ కాలేజీ విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. సాయి కౌశిక్ 99.53, కాయల తరుణ్ 97.78, సత్యం కుమార్జా 97.41, జశ్వంత్ 97.25 పర్సంటైల్ సాధించారు. మరో ఏడుగురు 95, 15 మంది 90 పర్సంటైల్ సాధించడంతో కాలేజీ చైర్మన్ అప్పలనాయుడు మాస్టర్ ఆధ్వర్యంలో బుధవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. బీజేపీ గాజువాక నియోజకవర్గ కో–ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు ముఖ్య అతిథిగా విచ్చేసి, విద్యార్థులను సత్కరించారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం



మాట్లాడుతున్న సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్

సీతంపేట: సహృదయ సాహితి ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖర మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కవిత్వంలో ప్రజల గొంతు ప్రతి ధ్వనిస్తుందన్నారు. సహృదయతే విధానమై, చైతన్యమే నినాదమై నవీన యుగాన్ని తన కవిత్వంలో కవి ఆవిష్కరిస్తాడని తెలిపారు. డాక్టర్ కె.జి.వేణు మాట్లాడుతూ ప్రముఖ వాగ్గేయకారుడు శ్యామశాస్త్రి గొప్పతనాన్ని, సంగీత విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో వి.ఎస్.ఎస్.మూర్తి, కె.వి.ఎస్.మూర్తి, చిన్న సూర్యనారాయణ, రామతాత, జి.ఎస్.వి.మాణిక్యాలరావు తమ కవితలు చదివి వినిపించారు.

ముగిసిన ఫిల్మ్ ఫెస్టివల్



మాట్లాడుతున్న సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న తెలుగు ఫిల్మ్ ఫెస్టివల్ బుధవారం ముగిసింది. ముగింపు చిత్రంగా 2021లో యు.వేణు దర్శకత్వంలో తెరకెక్కిన విరాటపర్వం చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని సమాంతర సినిమాలు, విదేశీ చిత్రాలు ప్రదర్శించడానికి ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. త్వరలో కె.విశ్వనాథ్ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తామన్నారు. మూడు రోజులు ప్రదర్శించిన చిత్రాలు తిలకించిన వారితో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి.చిన్నారావు, డాక్టర్ జి.బాబ్జి, అనూరాధ, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా.. మిద్దె పంట

కూరగాయలు కావాలంటే బుట్ట చేత పట్టుకుని మార్కెట్‌కు వెళ్తాం. అంత దూరం వెళ్లాక కూరగాయలు ఎక్కడ పండించారో, ఏయే ఎరువులు వాడారో తెలియకుండానే ఎక్కువ డబ్బులు పెట్టి కొంటాం. తీరా వాటిలో వాడిపోయినవి, పుచ్చిపోయినవి ఉంటే ఉసూరుమని చెత్తలో పడేస్తాం.. అదే మనం పెంచుకున్న మొక్క నుంచి ఒక్క కాయ కూర చేసుకుని తిన్నా ఆ రుచి అమోఘం.. ఆ ఆనందం వర్ణనాతీతం. కూర్మన్నపాలెం పరిధి తిరుమల నగర్ వాసులు ఆ రుచిని, ఆనందాన్నే ఆస్వాదిస్తున్నారు. తమ మేడనే పూలతోటగా, అందాల బృందావనంగా మార్చేశారు. – కూర్మన్నపాలెం



తిరుమల నగర్‌లో ఓ ఇంటి మేడపై పెంచుతున్న మొక్కలు



తిరుమలనగర్‌లోని ఓ ఇంటి మేడపై కాసిన బత్తాయి పండ్లు



మేడపై కాసిన సపోటా

- డాబాపై పండ్లు, కూరగాయల సాగు
- ఆదర్శంగా నిలుస్తున్న తిరుమల నగర్ వాసులు
- సేంద్రియ పద్ధతిలో పండిస్తూ సత్ఫలితాలు

కూర్మన్నపాలెం పరిధి తిరుమల నగర్‌లోని ప్రజలు తమ ఇంటి డాబాపై రకరకాల మొక్కలను పెంచుతూ ప్రాణంగా చూసుకుంటున్నారు. మేడపై ఉన్న తక్కువ స్థలంలోనే బంతి, చేమంతి, మందారం, మల్లి, సన్నజాజి, గులాబీ, కనకాంబరం, నంది వర్ధనాలు వంటి రకరకాల పూలమొక్కలు నాటారు. అవి చక్కగా పెరిగి మంచి సువాసనతో పాటు ఆ ప్రాంతానికి అందం తెచ్చాయి. వాటితో పాటు సపోటా, కిస్మిస్, ద్రాక్షపండ్లు, అంజీర్, దానిమ్మ, నిమ్మ, బొప్పాయి, రెడ్‌ప్లస్, గ్రీన్‌ఆపిల్, సీతాఫలం, జామ, రేగు, డ్రాగన్ ఫ్రూట్ తదితర పండ్ల మొక్కలను నాటి పండిన పండ్లను అందరికీ పంచుతున్నారు. బీర, ఆనప, వంకాయ, చిక్కుడు, కరివేపాకు, అల్లం, మామిడిఅల్లం, ఉల్లి, పచ్చిమిర్చి వంటి వాటితో పాటు బంగాళదుంప, బీట్‌రూట్, కేరట్, ముల్లంగి వంటి దుంప జాతులను సైతం పండించడం చూసి ఇంటికి వచ్చే బంధువులు, చూసిన వాళ్లు తిరుమలనగర్ వాసులు అభిరుచిని చూసి అభినందించకుండా ఉండలేకపోతున్నారు.

సంరక్షణలో సంతోషం

తిరుమల నగర్ వాసులు మొక్కలను ఎంతో ప్రేమగా సాకుతూ, వాటి సంరక్షణలోనే సమయాన్ని గడుపుతూ ఆనందపడుతున్నారు. క్రమం తప్పకుండా నీళ్లు పోయడం, మొక్కలకు పురుగు పట్టకుండా జాగ్రత్తలు తీసుకోవడం, ఆకులు రాలితే వాటిని తొలగించి శుభ్రం చేయడంతో పాటు గోమూత్రం, నల్లబెల్లం, బాగా మగ్గిన పండ్లు, కూరగాయల వ్యర్థాలు, మిగిలిన అన్నం, బియ్యం కడిగిన నీళ్లు, గంజి వంటి వాటిని ఎరువుగా తయారు చేసి మొక్కలకు వేస్తుంటారు. పూలు, పండ్లు, కూరగాయలు, తాము ఎప్పుడూ బయటి నుంచి తెచ్చుకునే అవసరమే రాలేదని చెబుతున్నారు. డాబాపై పండిన వాటిని వాడుకోవడంతో పాటు ఇరుగుపొరుగు వారికి, బంధువులకు, స్నేహితులకు ఇస్తుంటామని తెలిపారు.

ఆన్‌లైన్‌లోనూ విత్తనాల కొనుగోలు

తమకు కావలసిన మొక్కలను నర్సరీ నుంచి కొనుగోలు చేయడంతో పాటు బంధువుల ఇంటికి వెళ్లినప్పుడు, ప్రయాణాలు చేస్తున్నప్పుడు కనిపించిన మొక్కలను సేకరిస్తున్నారు. వాటిని వెంటనే నాటి, ఆ మొక్కలను పెంచుతున్నారు. ఇటీవల ఆన్‌లైన్‌లో కూడా విత్తనాలు, మొక్కలను కొనుగోలు చేయడం ద్వారా కూడా మొక్కలను పెంచుతున్నామని తిరుమల నగర్ వాసులు తెలిపారు.



తిరుమలనగర్‌లోని ఓ ఇంటి మేడపై విరబూసిన ముద్ద లిల్లీ పువ్వులు

ఆరోగ్యం.. ఆహ్లాదం



మా స్నేహితుడు ఇంటి మేడపై పంటలు పండించడం చూసి, నాకూ ఆసక్తి ఏర్పడింది. అప్పటి నుంచి నేను కూడా మా ఇంటి మేడపై మొక్కలు పెంచడం ప్రారంభించాను. నాతో పాటు మా కుటుంబసభ్యులకు కూడా ఖాళీ సమయమంతా మొక్కల మధ్య ఆనందంగా, ఆహ్లాదంగా గడిచిపోతోంది. కుండీల్లో మొక్కలు పెంచడంతో పాటు సొంతంగా సేంద్రియ ఎరువులను తయారు చేసుకుంటున్నాం. మా చేత్తో పండించిన కూరగాయలను తింటూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నాం.

– ఎస్.చంటి, తిరుమలనగర్ వాసి

స్టీల్‌ప్లాంట్ బ్రాంచ్‌ను సందర్శించిన ఎస్‌బీఐ జీఎం

ఉక్కునగరం: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అమరావతి సర్కిల్ నెట్ వర్క్–1 జనరల్ మేనేజర్ కిషన్ కుమార్ స్టీల్‌ప్లాంట్ ఎస్‌బీఐ ప్రధాన బ్రాంచ్‌ను బుధవారం సందర్శించారు. డీజీఎం మాన్‌మయ పాండవ్, రీజనల్ మేనేజర్ సంజీవ్ కుమార్ ఉపాధ్యాయ్‌లతో కలసి బ్రాంచ్‌ను పరిశీలించి, కార్యకలాపాలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు బ్రాంచ్ చీఫ్ మేనేజర్ జయ శంకర్ కే బృందం ఆయనకు స్వాగతం పలికింది. వినియోగదారుల సంతృప్తే ధ్యేయంగా పని చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో భాగంగా మృతుల కుటుంబీకులకు రూ. 15 లక్షల చెక్కును అందజేశారు. అనంతరం బ్రాంచ్ ఆవరణలో ఉన్నతాధికారులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో బ్రాంచ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



స్టీల్‌ప్లాంట్ బ్రాంచ్‌లో మొక్కలు నాటుతున్న జీఎం కిషన్ కుమార్

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన



ప్రమాదాలపై ప్రదర్శిస్తున్న చిత్రాలను వీక్షిస్తున్న యువకులు

గాజువాక : రోడ్డు భద్రతపై గాజువాక ట్రాఫిక్ పోలీసులు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాతగాజువాకలోని 400 బస్టాప్, అనకాపల్లి బస్టాప్, కొత్త గాజువాక జంక్షన్ వద్ద దృశ్య శ్రవణ సాధనాలతో ప్రచారం నిర్వహించారు. నగరంలో ఇప్పటివరకు జరిగిన ప్రమాదాలు, అందులో అతివేగం, నిర్లక్ష్యంగా వాహనం నడపడం కారణంగా చోటు చేసుకున్న ప్రమాదాలను వివరిస్తూ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ట్రాఫిక్ సీఐ ఆర్.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ అతివేగం ప్రమాదకరమని అన్నారు. జీవితంలో కొన్ని విషయాలకు చాలాకాలం వేచి చూస్తామని, వాహనాలను నడిపేటప్పుడు కూడా అదే విధంగా నడుచుకోవాలని సూచించారు.

ఎమ్మెల్సీగా సుధాకర్‌ను గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

ఉక్కునగరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతు అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కోరారు. స్థానిక స్టీల్‌క్లబ్‌లో బుధవారం ఆయన ప్రచారం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ సమస్యలపై సుధాకర్‌కు పూర్తి అవగాహన ఉందన్నారు. అందరికీ అందుబాటులో ఉన్న సుధాకర్‌ను గెలిపిస్తే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల కో–ఆర్డినేటర్ పూర్ణానంద శర్మ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు చూసి, పార్టీ బలపరిచిన అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పరదేశి, గొందేశి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో జీఆర్పీ సిబ్బంది తనిఖీలు



రైల్లో తనిఖీ చేస్తున్న జీఆర్పీ సీఐ

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో బుధవారం గవర్నమెంట్ రైల్వే పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. జీఆర్పీ సీఐ కోటేశ్వరరావు నేతృత్వంలో సబ్ ఇన్‌స్పెక్టర్ టి.కామేశ్వరరావు, సిబ్బంది ఈ తనిఖీ చేశారు. రైల్వేస్టేషన్, వివిధ ప్లాట్‌ఫాంలు, వెయిటింగ్ హాల్స్, పార్సిల్ కార్యాలయాలు, వివిధ రైళ్లలో తనిఖీలు చేపట్టారు. గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు ఈ తనిఖీలు ముఖ్య ఉద్దేశమని సీఐ తెలిపారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి



బీసీ గేటు వద్ద ధర్నా చేస్తున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్‌లో పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వైఎస్సార్‌టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద బుధవారం ఉదయం ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలని, ఎన్‌జేసీఎస్‌లో జరిగిన నూతన వేతన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. 2017 జనవరి 1 నుంచి వేతన బకాయిలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, పిట్టా రెడ్డి, గొందేశి వెంకటరమణారెడ్డి, దాలినాయుడు, ఎన్నేటి రమణ, సంపంగి ఈశ్వరరావు, గొందేశి అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు సువర్ణావకాశాలు

మురళీనగర్: పాలిటెక్నిక్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు పారిశ్రామిక, సాంకేతిక రంగంలో విస్తృతమైన ఉద్యోగావకాశాలు ఉన్నాయని రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి తెలిపారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఏర్పాటు చేసిన పలు సౌకర్యాలను ఆమె బుధవారం ప్రారంభించారు. ప్రిన్సిపాల్ జీవీ సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డిప్లమో కోర్సులు పూర్తి కాగానే ఉద్యోగాల్లో చేరడానికి ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. రెండేళ్ల అనుభవం సాధించిన అనంతరం ఉన్నత చదువులు చదువుకోవచ్చని చెప్పారు. ప్రస్తుతం 17 ఏళ్లకే నెలకు రూ.20 వేలు నుంచి రూ.30వేలు జీతం పొందే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఇటీవల పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులు రూ.6.67లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి టెక్‌ఫెస్ట్‌లో 833 ప్రాజెక్టులు రాగా.. ఇందులో పేటెంట్ హక్కుల కోసం 13 ప్రాజెక్టులు, ప్రొడక్షన్‌కు 55, ఇంక్యుబేషన్ విభాగానికి 53 ప్రాజెక్టులు ఎంపికయ్యాయని చెప్పారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ విద్యార్థులు స్టూడెంట్ చాప్టర్‌లో తమ పేరు నమోదు చేసుకోవడం ద్వారా కెరీర్‌కు అవసరమైన సహకారం లభిస్తుందన్నారు. ఇందులో వారు పంపించిన ఉత్తమ సృజనాత్మక ఆలోచనలకు పేటెంట్ పొందే అవకాశం ఉందన్నారు. బెస్ట్ ప్రాజెక్టులకు రూ.50 వేలు నగదు బహుమతి లభిస్తుందని తెలిపారు. ముందుగా కాలేజీలో ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీ, ఆధునికీకరించిన కార్యాలయం, ఇన్నోవేషన్ కేంద్రం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ స్టూడెంట్ చాప్టర్‌ను ప్రారంభించారు. మెటలర్జీ విభాగానికి దాత సమకూర్చిన ప్రయోగశాల పరికరాలను అందజేశారు. టెక్నికల్ ఎడ్యుకేషన్ టీపీవో విభాగం డీడీ డాక్టర్ ఎంఏవీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఇన్నోవేషన్ కేంద్రాన్ని ఆవిష్కరిస్తున్న టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ నాగరాణి

ప్రతీ గడపకు సంక్షేమ ఫలాలు



వృద్ధురాలికి సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: ప్రతీ గడపకూ సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. పేదలందరికీ కుల, మత, రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా లబ్ధిని చేకూరుస్తున్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 69వ వార్డు నాతయ్యపాలెంలో బుధవారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి, నివాసితులను ఆప్యాయంగా పలకరించారు. సంక్షేమ పథకాలను వివరించి, బ్రోచర్‌ను అందించారు. వారికి చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఇంతకు ముందెన్నడూ లేని విధంగా ప్రతీ ఇంటికీ సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత మన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే చెందుతుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను, ఇవ్వని వాటిని సైతం నెరవేర్చి, పేదల పెన్నిధిగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయన దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలను అప్పటికప్పుడే సంబంధిత సచివాలయ కార్యదర్శితో మాట్లాడి పరిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు, నాయకులు ఈగలపాటి యువశ్రీ, కమరున్నీసా బేగం, గంరెడ్డి రామునాయుడు, కాకి అప్పలరెడ్డి, టి.ఎల్.నర్సింగరావు, కర్రి దాలినాయుడు, సంద్రాన చినసన్యాసిరావు, గంరెడ్డి రంగనాయకులు, సిరసపల్లి ఈశ్వరరావు, కాదా నాయుడు, నారిపల్లి బంగారయ్య, పలు విభాగాల అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉక్కు పోరాటం భావి తరాలకు మార్గదర్శకం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న రామస్వామి

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో సాధించుకున్న పరిశ్రమను చేజార్చుకోబోమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. కార్మికులు చేస్తున్న ఉక్కు పోరాటం భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా మారుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 727వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకుడు యు. రామస్వామి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మాలనే నిర్ణయాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని ప్రధాని స్పష్టమైన ప్రకటన చేయాలని, లేనిపక్షంలో తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మంత్రి రాజశేఖర్, జె. అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు, వి.రామ్మోహన కుమార్, సీహెచ్ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న జెడ్సీ సింహాచలం

అగనంపూడి: స్వచ్ఛ విశాఖలో జీవీఎంసీకి ప్రథమ ర్యాంక్ రావడానికి ప్రతీ ఒక్కరు సహకారం అందించాలని గాజువాక జోనల్ కమిషనర్ పాందూరు సింహాచలం కోరారు. జీవీఎంసీ 88వ వార్డు వెదుళ్లనరవలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛతలో తడి పొడి చెత్త భాగమన్నారు. తడి పొడి చెత్తను ఇళ్లలో వేర్వేరుగా నిల్వ చేసి జీవీఎంసీ సిబ్బందికి అందించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా స్వచ్ఛ విశాఖ సాధ్యమని, తద్వారా ర్యాంకింగ్‌లో విశాఖను అగ్రభాగాన నిలపాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గంరెడ్డి కనకమహాలక్ష్మినాయుడు, మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు, నాయకులు సర్వసిద్ధి బొరయ్యానాయుడు, చట్టి తాతారావు శేఖరమంత్రి శ్రీనివాసరావు, వార్డు శానిటరీ సూపర్‌వైజర్ బి.వి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

గంగవరం ఆస్పత్రిలో తొలి ప్రసవం



తల్లీబిడ్డలతో డాక్టర్ వినయ్‌కుమార్, సిబ్బంది

పెదగంట్యాడ: ఇటీవల నూతనంగా ప్రారంభమైన గంగవరంలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ఓ గర్భిణి బుధవారం పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. గంగవరం గ్రామానికి చెందిన నిండు గర్భిణి ఆర్.దేవికి బుధవారం నొప్పులు రావడంతో స్థానిక యూపీహెచ్‌సీకి తీసుకువచ్చారు. డాక్టర్ వినయ్‌కుమార్, సిబ్బంది వెంటనే స్పందించి, ఆమెకు ప్రసవం చేశారు. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నారు. వైద్యులు సకాలంలో స్పందించి నార్మల్ డెలివరీ చేసి, పండంటి పాపను తమకు కానుకగా అందజేశారని దేవి కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. డాక్టర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ ఆస్పత్రిలో అధునాతన సౌకర్యాలున్నాయని, రోగులు సేవలను వినియోగించుకోవాలని కోరారు.

నాడు రాళ్లు తేలి.. నేడు సాఫీగా మారి..

- గాంధీనగర్ రోడ్డుకు మహర్దశ



గాంధీనగర్ వాటర్ ట్యాంక్ ప్రాంతంలో కొత్తగా వేసిన రోడ్డు (నేడు)



గోతులమయమైన రహదారి (నాడు)

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని గాంధీనగర్ వాటర్ ట్యాంక్ ఏరియాలో కొత్తగా తారు రోడ్డు నిర్మించారు. గతంలో ఈ రోడ్డు అధ్వానంగా ఉండేది. రాళ్లు తేలిపోవడంతో రాకపోకలకు స్థానికులు అవస్థలు పడేవారు. రోడ్డు మొత్తం ఛిద్రం కావడం, రాళ్లు తేలిపోవడంతో వాహనాలు తరచూ మరమ్మతులకు గురయ్యేవి. దీంతో వాహనచోదకులు ఈ రోడ్డులో ప్రయాణమంటేనే హడలిపోయేవారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఈ ప్రాంతంలో గడపకు గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించిన సమయంలో గాంధీనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కాతా బాలకృష్ణ రహదారి దుస్థితిని ఎమ్మెల్యే నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను వారికి వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే నాగిరెడ్డి వెంటనే నిధులు మంజూరు చేయించారు. దీంతో సుమారు 7లక్షలతో తారు రోడ్డు వేయించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే నాగిరెడ్డికి, దేవన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పురాణేతిహాసాలు మానవాళికి మార్గదర్శకాలు



కార్యక్రమంలో పాల్గొన్న శ్రీశంకర విజయేంద్ర సరస్వతి, బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

ఎంవీపీ కాలనీ: పురాణ ఇతిహాసాలు మానవాళి జీవనానికి మార్గదర్శకాలని కంచికామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి అన్నారు. బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మతో కలిసి ఆయన బుధవారం శ్రీసౌందర్యలహరి ప్రవచన మహోత్సవాల్లో పాల్గొన్నారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని ఏబీసీ పార్కులో శ్రీశక్తి పంచాయతన యోగ పూర్వక శ్రీ సౌందర్యలహరి ప్రవచన మహోత్సవాలు కొద్ది రోజులుగా జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా శ్రీశంకర విజయేంద్ర సరస్వతి మాట్లాడుతూ పురాణాలు, ఇతిహాసాలు, ఉపనిషత్తుల్లో విశేషమైన విజ్ఞానం దాగి ఉందన్నారు. ఈ విజ్ఞానం మానవ మనుగడ, జీవన విధానానికి మార్గనిర్దేశంగా నిలుస్తుందన్నారు. సనాతన ధర్మాలపై ప్రజలను చైతన్యం చేసేందుకు షణ్ముఖశర్మ చేస్తున్న కృషిని అభినందించారు. షణ్ముఖశర్మ ప్రవచనాలను ఆయన ఆసక్తిగా తిలకించారు. కేవీఎస్ శ్యామ్, అరుణగాయత్రి పాల్గొన్నారు.